క్లుప్తంగా

వర్షంతో ఉపశమనం



దుగ్గేరు సమీపంలో కురుస్తున్న వర్షం

మక్కువ: మండలంలో శనివారం మధ్యాహ్నం ఉరుములతో కూడిన వర్షం పడింది. దుగ్గేరు గ్రామంలో వడగళ్లు పడ్డాయి. ఈదురుగాలుల ప్రభావానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. గత కొద్దిరోజులుగా ఎండ తీవ్రతకు అవస్థలు పడుతున్న ప్రజలు అకాల వర్షంతో ఉపశమనం పొందారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో పలు ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా కనిపించాయి.

ఈఎంఆర్ఎస్ ప్రవేశ పరీక్షకు 235 మంది హాజరు

సీతానగరం: మండలంలోని జోగింపేట ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్(ఎస్ఓఈ) విద్యాలయంలో శనివారం ఈఎంఆర్ఎస్ ప్రవేశ పరీక్ష ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పోల వెంకటినాయుడు తెలిపారు. ప్రవేశ పరీక్షలకు మొత్తం 251 మంది హాజరుకావాల్సి ఉండగా..235 మంది హాజరైనట్లు చెప్పారు. మాస్‌కాపీయింగ్ జరగకుండా పటిష్టంగా పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు.

నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మక్కువ: మండలంలోని ములక్కాయవలస ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదివారం స్థానిక పాఠశాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.స్వర్ణలత తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, పరీక్ష సమయానికి అరగంట ముందు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.


తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

పార్వతీపురం టౌన్: జిల్లాలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడిన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మక్కువ మండలంలో మక్కువ, కోన, బంగారువలస గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో నీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. మక్కువ మండలంలో 18 గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే మంచినీటి పథకం మోటార్ల మరమత్తు పనులను రెండు రోజుల్లో పూర్తి చేసి పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు.

మూడోరోజు నామినేషన్లు నిల్

సాలూరు: సాలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి శనివారం ఎటువంటి నామినేషన్లు దాఖలు కాలేదని ఆర్‌ఓ కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఇప్పటివరకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర ఒక సెట్, టీడీపీ అభ్యర్థి జి.సంధ్యారాణి రెండు సెట్లు చొప్పున మొత్తం 3 సెట్లు నామినేషన్లు అందినట్లు చెప్పారు. కాగా, ఈనెల 24న రాజన్నదొర మరో సెట్ నామినేషన్ వేయనున్నారు.

రూ.9 లక్షలతో తాగునీటి ట్యాంక్ నిర్మాణం



వెలగవలసలో నిర్మించిన వాటర్ ట్యాంక్

సాలూరు రూరల్: మండలంలోని మరిపల్లి పంచాయతీ వెలగవలస గ్రామంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.9 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. ఇక్కడ నుంచి పైపులైన్ ఏర్పాటు చేసి గ్రామంలో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. గతంలో తాగునీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మించి పైపులైన్ సాయంతో ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తుండటంతో తాగునీటి కష్టాలు తీరాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ దాఖలు

కురుపాం: కురుపాం ఎమ్మెల్యే స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా కొమరాడ మండలం సోమినాయుడువలస గ్రామానికి చెందిన మోసూరు రామన్నదొర శనివారం దాఖలు చేశారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వెంకటరమణకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇప్పటివరకు కురుపాం నియోజకవర్గానికి సంబంధించి మూడు నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ-1, స్వతంత్ర-2 మొత్తం 3 నామినేషన్లు వచ్చాయని ఆర్‌ఓ తెలిపారు.

రాష్ట్రంలో ఫ్యాన్ ప్రభంజనం ఖాయం



27వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు, ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

- వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ఫ్యాన్ గాలిని ఆపే దమ్ము ఎవరికీ లేదని, మళ్లీ రాష్ట్రంలో ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం పట్టణంలో 27, 29వ వార్డుల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల అభ్యున్నతే ధ్యేయంగా సుపరిపాలన అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని కోరారు. రాష్ట్రంలో సంక్షేమ యజ్ఞం నిరంతరాయంగా కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలన్నారు.

నియోజకవర్గంలో 1.54 లక్షల మందికి లబ్ధి

గత ఐదేళ్లలో పార్వతీపురం నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.1540 కోట్లు ఖర్చుచేసినట్లు చెప్పారు. 1.54 లక్షల మందికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం చేరువయ్యాయని అన్నారు. మహిళా సాధికారితలకు ప్రాధాన్యమిస్తూ.. వారి పేరిట అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. మే 13న జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయడం ద్వారా ఈ సంక్షేమాన్ని కొనసాగించుకుందామని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రతీ గడప వద్ద మహిళలు ఎమ్మెల్యేకు హారతులు పట్టి విజయతిలకం దిద్దారు. తమకు మేలు చేసిన ప్రభుత్వానికి మద్దతిస్తామని, ఫ్యాను గుర్తుపై ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, వైస్ చైర్మన్ యిందుపూరు గుప్తేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి జగనన్నను ఆశీర్వదించండి

సీతానగరం: మండలంలోని పాపమ్మవలసలో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తమను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారికి గ్రామస్తులు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. లబ్ధిపొందిన వారంతా జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు. ఐదేళ్లలో నియోజకవర్గంలో గుర్తించిన ప్రధాన సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. మరోసారి తమకు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జగదీష్, శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, మాజీ ఎంపీపీ కె.రత్నాకర్, మండల నాయకులు పి.ఈశ్వరనారాయణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీతానగరం: అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణికి విజయతిలకం దిద్దుతున్న మహిళ



పార్వతీపురంటౌన్: ఎన్నికల ప్రచారంలో రిక్షా లాగుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు

ప్రచార పర్వం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండి



సాలూరు: పెద్దబజారులో ఎన్నికల ప్రచారం చేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

- ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం రాజన్న దొర

సాలూరు: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన అందించిందని, మరింత సంక్షేమం, అభివృద్ధి సాధించుకునేందుకు రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్న దొర కోరారు. పట్టణంలోని పెద్దబజారు, శివాజీ సెంటర్, తదితర ప్రాంతాల్లో శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. స్థానికులు, వ్యాపారులు, వర్తకులు రాజన్నదొరకు పూలమాలలు వేసి, హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. అనంతరం రాజన్నదొర దుకాణదారుల వద్దకు వెళ్లి ఐదేళ్లలో సాలూరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. వర్తకులు, వ్యాపారులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. పెద్దబజారు విషయంలో గతంలో టీడీపీ ప్రభుత్వంలో జరిగిన పరిణామాలను గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రజలకు మేలు చేసేది జగన్‌మోహన్‌రెడ్డి కాగా, ప్రజలను మోసం చేసేది చంద్రబాబు అని అన్నారు. టీడీపీ మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు వంగపండు అప్పలనాయుడు, గిరిరఘు, జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, రాపాక మాధవరావు, బలభద్ర శ్రీనివాసరావు, వుప్పల వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీగా సంధ్యారాణి సాలూరుకు ఏం చేశారు?



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు రెడ్డి పద్మజ

- ఎన్ని రోడ్లు వేశారో, ఎంత మందికి పింఛన్లు మంజూరు చేశారో చెప్పాలి?
- సంధ్యారాణికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ సూటిప్రశ్న

సాలూరు రూరల్: టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్సీగా పనిచేసిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి సాలూరు నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేంటో చెప్పాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ సవాల్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీ అభ్యర్థి సంధ్యారాణి సాలూరు మండలంలో ప్రచారానికి వెళ్లి మీ గ్రామాలకు నేనే రోడ్లు వేయించాను అని చెప్పుకుంటున్నారని, ఇలా ప్రజలను మభ్యపెట్టడం టీడీపీ నాయకులకు అలవాటైన విద్య అని విమర్శించారు. 2014–19 వరకు సాలూరులో ఎన్ని భవనాలు, రోడ్లు నిర్మించారో చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ, బీసీలకు ఎన్ని పింఛన్లు మంజూరు చేశారో, ఎన్ని ఇళ్లు నిర్మించి ఇచ్చారో చెప్పాలన్నారు. రూ.50 లక్షలతో స్థానిక ఎమ్మెల్యే రాజన్నదొర తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం చేపడితే.. పది మంది టీడీపీ నాయకులతో కలిసి దాని ముందు సెల్ఫీలు తీసుకుని నేనే నిర్మించాలని అసత్య ప్రచారం చేసుకుంటున్నారని, అబద్ధాలు చెప్పడంతో సంధ్యారాణి ఆ పార్టీ నాయకుడు చంద్రబాబును మించి పోయారని ఎద్దేవా చేశారు. అలాగే వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశానని చెప్పుకుంటున్న మీరు ఆస్పత్రి నిర్మాణానికి ఎన్ని నిధులు కేటాయించారో, ఎవరు టెండర్ పాడారో, జీవో నంబరు వివరాలు ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. మా నాయకుడు కులం కోసం మాట్లాడితే ఉలిక్కి పడుతున్నారెందుకు అని ప్రశ్నించారు. బీసీల వద్దకు వెళ్లి తాను బీసీనని, ఎస్టీల వద్దకు వెళ్లి ఎస్టీ అని చెప్పుకుంటున్నది మీరు కాదా అని నిలదీశారు. ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని, లేదంటే ప్రజలే తగిన బుద్ధి చెపుతారని హితవుపలికారు.

మేలు చేసిన వారిని మరవద్దు..

సాలూరు రూరల్: మండలంలోని కరకవలస, దత్తివలస గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రెడ్డి పద్మజ శనివారం ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో డిప్యూటీ సీఎం రాజన్నదొర సాలూరు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారన్నారు. జగనన్న అందించిన పథకాలు పేదలకు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఏవిధంగా ఉపయోగపడ్డాయో వివరించారు. మీకు మేలు జరిగిందని అనిపిస్తే.. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

సంక్షేమం కావాలంటే.. మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలి



బలిజిపేట: పి.చాకరాపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న శ్రీకాంత్, నాయకులు

- తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్
- పి.చాకరాపల్లిలో ఎన్నికల ప్రచారం

బలిజిపేట: రాష్ట్రంలో సంక్షేమం కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ రావాలని, అందుకోసం రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మండలంలోని పి.చాకరాపల్లిలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ పాలనలో సంక్షేమ పథకాలంటే ప్రజలకు తెలియవని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాతే సంక్షేమ పథకాలంటే ఏమిటో తెలిశాయన్నారు. అర్హత ఉంటే నేరుగా లబ్ధిదారుకే పథకాలు అందించే ప్రభుత్వం కావాలో, పచ్చ చొక్కాల నాయకుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉంటారో ప్రజలే నిర్ణయించుకోవాలని సూచించారు. ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించిన ప్రభుత్వాన్ని ఇంతకుముందు ఎప్పుడైనా చూశారా? సంక్షేమ పథకాల కోసం మీరు ఎవరి చుట్టూ అయినా తిరిగారా? ఎవరికైనా లంచాలు ఇచ్చారా..? కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారా..? అని ప్రజలను ప్రశ్నించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వలంటీర్ల ద్వారా అర్హుల గడప వద్దకే సంక్షేమ పథకాలను చేరవేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అటువంటి నాయకుడిని తిరిగి గెలిపించుకోవాల్సిన అవసరం మనకు ఉందన్నారు. ఎమ్మెల్యేగా అలజంగి జోగారావును, ఎంపీగా తనూజారాణిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.మోహనరావు, పార్టీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీపీ నాగమణి, జడ్పీటీసీ ఎ.రవికుమార్, పెద్దింపేట సర్పంచ్ జయప్రకాష్, మాజీ సర్పంచ్ ఆదిలక్ష్మి, కె.సత్యనారాయణ, కె.అప్పారావు, ఎ.సంగంనాయుడు, బి.చిన్నపదొర, సీహెచ్.మురళి, పి.వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.

ఓటమి భయంతో సంధ్యారాణికి మతిభ్రమించింది

- ఎంపీపీ బడ్నాన ప్రమీల



పాచిపెంట: ప్రజా క్షేత్రంలో తానెప్పుడూ గెలవలేనని నిర్ధారణకు వచ్చి, ఓటమి భయంతోనే సంధ్యారాణి మతిభ్రమించిందని ఎంపీపీ బడ్నాన ప్రమీల విమర్శించారు. పాచిపెంట మండల కేంద్రంలో శనివారం ఆమె మాట్లాడుతూ.. ప్రజాభిమానంతో ప్రతీ ఎన్నికల్లో గెలుస్తున్న రాజన్నదొరను, ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేక సంధ్యారాణి విమర్శించడం సిగ్గుచేటన్నారు. టీడీపీ పాలనలో ఎమ్మెల్సీగా ఉన్న సంధ్యారాణి నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారో చెప్పకుండా నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషిచేసిన రాజన్నదొరను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి పనులు చేయకుండా శంకుస్థాపనల పేరుతో కొబ్బరికాయలు కొట్టడం తప్ప టీడీపీ నాయకులు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. శిలాఫలకాలు వేసి పనులు పూర్తయిపోయినట్లు ప్రచారం చేసుకోవడం శోచనీయమన్నారు. రాజన్నదొర హయాంలో పెద్దగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం, సాలూరులో వంద పడకల ఆస్పత్రి, కందుల పదం వంతెన నిర్మాణం చేపడితే వాటిని మేమే చేశామని సంధ్యారాణి బీరాలు పలకడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రజలకు మంచి చేయడమే రాజన్నదొర అజెండా అని, అందుకే ప్రతి ఎన్నికల్లో ప్రజాశీర్వాదంతో ఆయన విజయడంఖా మోగిస్తున్నారని పేర్కొన్నారు. సొంత పార్టీలో నాయకులే సంధ్యారాణిని నమ్మే స్థితిలో లేరని, ఇంక ప్రజలు ఆమెను ఎలా నమ్ముతారని అన్నారు. ఓటమి భయంతో ఉన్న సంధ్యారాణికి వడదెబ్బ కూడా తగిలి మతిభ్రమించి రాజన్నదొరపై తప్పుడు మాటలు మాట్లాడి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.

11 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా

సీతానగరం: మండలంలోని తామరఖండి, పెదంకలాం గ్రామ సచివాలయాల పరిధిలో సేవలందించిన వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావుకు శనివారం అందజేశారు. తామరఖండి నుంచి 8 మంది, పెదంకలాం నుంచి ముగ్గురు రాజీనామా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ నిస్వార్థ సేవలందించామని, ప్రతిపక్ష నాయకులు రాజకీయ దురుద్దేశంతో తమను కించపరిచేలా ఆరోపణలు చేయడంతో మనస్తాపం చెంది రాజీనామాలు చేసినట్లు చెప్పారు. ఇకమీదట నేరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొని జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామన్నారు.

గిరిజన గ్రామాల్లో నిరంతర వైద్యసేవలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ఐశ్వర్య

పార్వతీపురంటౌన్: గిరిజన గ్రామాల్లో నిరంతర వైద్య సేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి ఐశ్వర్య అన్నారు. మండలంలోని వెలగవలసలో శనివారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. 67 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి 13 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు చేయడంతో పాటు 67 రకాల మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రతీ గ్రామంలో నెలకు రెండు సార్లు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. వైద్య సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



తాగునీటి నాణ్యతను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురం టౌన్: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. పట్టణంలోని 3,4 వార్డుల్లో శనివారం పర్యటించారు. తాగునీటి సరఫరా, సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. కొత్తవలస ప్రాంతంలోని మణికంఠకాలనీ, కొత్తపోలమ్మకాలనీ, పెద్ద వీధి, నందమూరి కాలనీ, నవిరి కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని గుర్తించారు. సంబంధిత శానిటేషన్ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలి: ఆర్ఓ



విద్యుత్ అధికారులకు సూచనలిస్తున్న పీవో కల్పనాకుమారి

సీతంపేట: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకు మారి తెలిపారు. స్థానిక ఐటీడీఏలో ట్రాన్స్‌కో అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. పాలకొండలోని స్ట్రాంగ్‌రూం వద్ద ఈవీ ఎం యంత్రాల ర్యాండమైజేషన్ కమీషనింగ్, పోలింగ్ ముందు రోజు పంపిణీ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సమయంలో తప్పనిసరి గా విద్యుత్ సరఫరా ఉండాలని, ఎటువంటి అంతరాయం ఉండకూడదని సూచించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఈఈ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెలవులను సద్వినియోగం చేసుకునేలా చూడండి



మాట్లాడుతున్న ఎంఈఓ సింహాచలం

పార్వతీపురం టౌన్: వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా 'సెలవుల్లో సరదాగా–2024' కార్యక్రమాలు నిర్వహించాలని ఎంఈఓ సామల సింహాచలం సూచించారు. మండలంలోని గోపాలపురం, పీఎన్‌వలస, అడ్డాపుశీల ఎంపీపీ పాఠశాలలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయుల డైరీలు, విద్యార్థుల మార్కుల రిజిస్టర్లను పరిశీలించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఎఫ్ఏ, ఎస్ఏ మార్కులను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట హెచ్ఎంలు టీకు వెంకటరావు, లక్ష్మునాయుడు, గుంట గంగరాజు, సీఆర్‌టీ అనురాధ, ఉపాధ్యాయులు ఉన్నారు.

జోరుగా హోం ఓటింగ్ దరఖాస్తుల సేకరణ

భామిని:

ఎన్నికల సంఘం నూతనంగా అమలు చేస్తున్న హోం ఓటింగ్ దరఖాస్తుల సేకరణ జోరుగా సాగుతోంది. మండలంలో ఐదు ఎన్నికల సెక్టార్ల పరిధిలో వృద్ధుల స్థితిగతులపై విచారించి హోం ఓటింగ్‌కు అనుమతులు సేకరణ చేపట్టారు. వృద్ధులు, దివ్యాంగుల నుంచి వీటిని సేకరించి వారి ఓటు హక్కు వినియోగించుకునేలు చర్యలు చేపట్టారు.

నేరడి బీ సెక్టార్ అధికారిణి, సీడీపీఓ శాంతి భవాని, బీఎల్ఓ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి అనుమతి పత్రాలు తీసుకున్నారు. ఓటర్ల సమ్మతి మేరకు ఇంటి వద్దకే బ్యాలెట్ పట్టుకొని వచ్చి ఓటింగ్ చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

సమస్యలపై తక్షణమే స్పందించండి

పాలకొండ రూరల్: ప్రజాసమస్యలపై సచివాలయ సిబ్బంది తక్షణమే స్పందించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని అంపిలి, అన్నవరం, గోపాల పురం సచివాలయాలను శనివారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న క్రమంలో అనుసరించాల్సిన నిబంధనల పై అవగాహన కల్పించారు.